క్లుప్తంగా

నేడు సమావేశం

మాగనూర్: మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 25న ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్తు సమావేశ మందిరంలో ఎంపీపీ శ్యామలమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



మరికల్: మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీల నాయకులు మంగళవారం పార్టీ సీనియర్ నాయకులు రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. సర్పంచ్ గోవర్ధన్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు చూసి బీఆర్‌ఎస్‌లోకి కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీల వారు చేరుతున్నారన్నారు. మునుముందు మరిన్ని చేరికలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో బసంత్, సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, రమేష్, బీమేష్, రాంరెడ్డి, సలీమ్, కృష్ణయ్యలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చిత్రపటం ఏర్పాటుకు వినతి



ధన్వాడ: గణతంత్ర దినోత్సవ వేడుకలలో అంబేడ్కర్ చిత్రపటాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ధన్వాడు యువత అన్నారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో జెండా ఆవిష్కరణ చేసేప్పుడు అంబేడ్కర్ చిత్రపటం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజు, రవి, బాల్‌రాజు, మహమూద్, రఘు ఉన్నారు.

సన్మానం



నారాయణపేట రూరల్ : మైనార్టీల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని మహబూబ్ అలీ అన్నారు. జాతీయ మైనార్టీ కమిషన్ సలహా సభ్యులుగా ఎన్నికైన ఆయనను మంగళవారం బీజేపీ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ముస్లింలకు బీజేపీ వ్యతిరేకం అనే మాటను ఖండిస్తున్నానని, ఎన్నో రకాలుగా కేంద్రం ముస్లింల అభివృద్ధికి కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో ప్రభాకర వర్ధన్, నర్సింహులు, రఘువీర్, లక్ష్మి, సాయి బన్న, రఘురామయ్యగౌడ్, భరత్, కృష్ణ, సుజాత, గోపాల్ పాల్గొన్నారు.

కృష్ణా: మాజీ సర్పంచ్ మహాదేవ్‌ను రాయచూర్ పట్టణంలోని యానగుంది మాణిక్యమ్మ ట్రస్ట్ సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. అమ్మవారి పాదుకలు రాయచూర్ పట్టణానికి తీసుకువచ్చిన నేపథ్యంలో కార్యక్రమం నిర్వహించారు. నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మంత్రికి వినతిపత్రం అందించిన నాయకులు

ఊట్కూరు: వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నారాయణపేట పట్టణంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్‌కు నాయకులు వినతిపత్రం అందించారు. వీఆర్‌ఏల జేఏసీ చైర్మెన్ రాజప్ప, నాయకులు శ్రీనివాస్ గౌడ్, కనకప్ప, ఆంజనేయులు, కృష్ణ పాల్గొన్నారు.

ఎండుతున్న బృహత్ వనాలు

- నిర్వహణ లేక వెలవెలబోతున్న వైనం
- సకాలంలో డబ్బులు ఇవ్వడం లేదని పనులకు ముందుకు రాని కూలీలు
- పట్టించుకోని అధికారులు



ప్రకృతి వనం ముఖద్వారం



నిర్వహణ లేక బోసిపోయిన కందెన్‌పల్లి బృహత్ వనం

దామరగిద్ద: పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని కాపాడాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి మండలంలో ఎంపిక చేసిన గ్రామాల పరిధిలో నిర్మించిన బృహత్ పల్లె ప్రకృతి వనాలు నిర్వహణలోపంతో వెలవెలబోతున్నాయి. ఆయా వనాల్లోని రూ. లక్షలు ఖర్చు చేసి నాటిన మొక్కలు ఎండిపోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. మండలంలోని కందెన్‌పల్లి, బాపన్‌పల్లి, విఠలాపూర్, సజనాపూర్, అయ్యవారిపల్లి గ్రామాల్లో బృహత్ పల్లె ప్రకృతి వనాలను మంజూరు చేసి నిర్మించారు. స్థల సదుపాయాలను ఆధారంగా చేసుకుని 35 వేల వరకు మొక్కలను నాటారు. అయ్యవారిపల్లిలో ప్రకృతి వనం ఏర్పాటు మధ్యలో నిలిచిపోగా, బాపన్‌పల్లిలో సరైన రోడ్డు సదుపాయంలో లేక మొక్కలకు నీటిని అందించడం లేదు. ఆయా వనాలలో మొక్కల సంఖ్యకు అనుగుణంగా ఉపాధి కూలీలకు వాచర్‌లుగా, వన సంరక్షులుగా నియమించి చేతులు దులుపుకున్న అధికారులు కనీసం వారికి కూలీ డబ్బులు కూడా అందించడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కందెన్‌పల్లిలో మొదట 8 మంది పనిచేస్తుండగా కూలీ డబ్బులు అందక కేవలం ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు. విఠలపూర్‌లో నలుగురు, సజనాపూర్‌లో ఇద్దరు ఉపాధి కూలీలు నర్సరీల నిర్వహణ చేస్తున్నారు. వీరికి సకాలంలో కూలీ డబ్బులు అందక పనులు చేయడంలేదు. దీంతో బృహత్ వనాలు నిర్వహణలో లోపాలు తలెత్తుతున్నాయి. తద్వారా రూ. లక్షలు ఖర్చుపెట్టి నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. దీంతో ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మొక్కలను సంరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

కూలీ డబ్బులు ఇవ్వడం లేదు



వనాలలో ఉన్న మొక్కలకు రోజూ నీళ్లు పెట్టే పనిచేయాలని అధికారులు సూచించారు. ఉపాధిపథకం కింద రోజు లెక్కన డబ్బులు అందజేస్తామన్నారు. కానీ సకాలంలో డబ్బులు ఇవ్వడం లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. బిల్లులు చేసి కూలీ డబ్బులు ఇస్తామంటున్నారు. ఇళ్లు గడవటం కష్టమవుతోంది. వారానికో, నెలకో డబ్బులు చెల్లించి ఆదుకోవాలి. -నర్సప్ప, ప్రకృతి వనం వాచర్, సజనాపూర్

చర్యలు తీసుకుంటాం

బృహత్‌పల్లె ప్రకృతి వనాలల్లో రూ.10 లక్షల వ్యయంతో 48,520 మొక్కలను నాటాం. వాచర్‌లను నియమించి మొక్కలను సంరక్షిస్తున్నాం. కూలీ డబ్బులు సకాలంలో అందడం లేదని పనులు చేయడానికి కూలీలు ముందుకు రావడం లేదని ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు తెలియజేస్తున్నారు. ఆయా గ్రామాల్లోని వనాలను పరిశీలించి సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. -రవికుమార్, ఇన్‌చార్జ్ ఏపీఓ, దామరగిద్ద

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ఎల్లమ్మ జాతరలో భక్తుల సందడి

మరికల్: ఐదేళ్లకోసారి వచ్చే రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలు మంగళవారం తీలేర్ గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ శివారుల్లో ఉన్న బావి నుంచి అమ్మవారికి జల్దిబిందె ఊరేగింపుగా తీసుకొచ్చి జల, పంచామృతాభిషేకం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు బోనాలు సమర్పించారు.

ధన్వాడ: మండల కేంద్రంలో కంచుకోటలో ఉన్న జములమ్మ దేవాలయంలో జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. లింగంపల్లి ఎల్లమ్మ జాతరను పురస్కరించుకోని 5 వారాల పాటు ప్రతి మంగళవారం జములమ్మను భక్తులు పూజిస్తారు. కాగా ఆలయ ప్రాంగణంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

వైభవంగా మార్కండేయస్వామి డోలారోహణ



డోలారోహణలో పాల్గొన్న భక్తులు

నారాయణపేట టౌన్ : పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భక్త మార్కండేయ స్వామి జయంతి ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌రోడ్‌లో వెలసిన ఆలయంలో స్వామివారికి ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. డోలారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు డా.క్యాతన్ రఘునాథ్, గౌరవాధ్యక్షుడు తాటి నర్సప్ప, కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు పగుడాకుల వెంకట్రాములు, సలహా కార్యదర్శి తిలక్‌బాబు, కర్లి ఆనంద్, తాటి లక్ష్మి నారాయణ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయస్వామి జయంతి ఉత్సవాలను ఆలయంలో మంగవారం ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం అధ్యక్షులు కెంచెబాల్‌రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు వెంకట్రాములు, లోకేష్, మాకం సురేందర్, నాగర్జున్, అరుణశ్రీ, చంద్రకళ, లత తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు



మంత్రి కేటీఆర్‌తో ఫొటో దిగుతున్న జర్నలిస్టులు

నారాయణపేట: జిల్లాలోని జర్నలిస్టుందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు తనవంతు కృషి చేస్తానని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. మంగళవారం నారాయణపేటలో వివిధ అభివృద్ధి పనులు, శంకుస్థాపనల్లో భాగంగా మినీట్యాంక్ బండ్‌ను ప్రారంభించిన అనంతరం స్థానిక జర్నలిస్టుల కోరిక మేరకు ఫొటో దిగారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారా అని అడగగా ఇంకా ఇవ్వలేదని సమాధానం ఇచ్చారు. అక్కడే ఉన్న స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డిని పిలిచి కలెక్టర్‌తో మాట్లాడి ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చూడాలని సూచించారు.

ఇథనాల్ కంపెనీపై స్పందించలేదని నిరసన



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ఎక్లాస్‌పూర్ గ్రామస్తులు

మరికల్: పర్యావరణానికి ముప్పుగా ఉన్న ఇథనాల్ కంపెనీపై మంత్రి కేటీఆర్ స్పందించకపోవడంతో చిత్తనూర్, ఎక్లాస్‌పూర్ గ్రామస్తులు మంగళవారం తమ గ్రామాల్లో నిరసన వ్యక్తం చేశారు. రైతుకూలీ సంఘం నాయకులు మల్లేష్ మాట్లాడుతూ జిల్లాకు వచ్చిన మంత్రి కేటీఆర్ చిత్తనూర్ దగ్గర ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా నిర్మిస్తున్న కంపెనీపై ఎందుకు స్పందించలేదన్నారు. ఏడాది నుంచి కంపెనీకి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తుంటే ప్రజాప్రతినిధులు చిన్నచూపు చూడటం తగదన్నారు. కంపెనీ వల్ల 32 గ్రామాల ప్రజలకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదని గ్రామస్తులు మరోసారి హెచ్చరించారు. రామచంద్రయ్య, తిరుపతయ్య, రాములమ్మ, పద్మమ్మ, లక్ష్మమ్మ, రామలింగప్ప, చంద్రప్ప, శ్రీను, చెన్నయ్యలు పాల్గొన్నారు.

అరెస్టులు చేయడం సరికాదు

నారాయణపేట రూరల్ : ఉద్యమాలను పోలీసులతో అరెస్టులు చేయించి అడ్డుకోలేరని జల సాధన సమితి కో కన్వీనర్ నర్సింహా అన్నారు. జీఓ 69పై మంత్రి కేటీఆర్ ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తే అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్ తరలించడం సరికాదన్నారు. పాలమూర్-రంగారెడ్డి పథకంతో ఎలాంటి ప్రయోజనం జరగదని, నారాయణపేట జిల్లా ప్రజలకు పేట - కొడంగల్ ఎత్తిపోతలతోనే న్యాయం జరుగుతుందన్నారు. 90శాతం నిధులు కేంద్రం ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు ఇబ్బంది కలుగుతుందని ప్రశ్నించారు. కరువు ప్రాంతానికి సాగు, తాగునీరు అందించి ఆదుకోవాలని, వలసలను అరికట్టాలని కోరారు.

నిడ్జింతలో బాలికా దినోత్సవం



బాలికా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని నిడ్జింత ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని రూంటూ రీడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. బాలికల హక్కులు, రక్షణ, పోషకాహారం, లింగసమానత్వం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలికలకు డ్రాయింగ్ కాంపిటీషన్ నిర్వహించి విజేతలకు బహుమతులను సర్పంచ్ లావణ్యతో ప్రదానం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రఘు, లాజర్, లత, సంస్థ ప్రతినిధులు మమత, లలిత, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక చట్టం అమలు చేయాలి



నారాయణపేట రూరల్ : వ్యవసాయ కార్మికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్రమైన చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని ఏఐఏకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాములు డిమాండ్ చేశారు. మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో మంగళవారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక చట్టం కోసం దశాబ్దాల తరబడి పోరాటం చేస్తున్నా పాలకుల నిర్లక్ష్యంతో రాజ్యాంగ హక్కులు దక్కడం లేదన్నారు. యంత్రీకరణతో వలస కార్మికుల నిజ వేతనాలు పడిపోతున్నాయని, అసంఘటిత వర్గం ఇబ్బందులకు గురవుతుందన్నారు. కార్యక్రమంలో నర్సింహులు, బస్సప్ప, రాములు, బన్నప్ప, కన్నప్ప పాల్గొన్నారు.

సభకు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు



జిల్లా కేంద్రంలో డప్పులతో ర్యాలీగా తరలుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రానికి మంగళవారం రాష్ట్ర మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విచ్చేసిన సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలి వెళ్లారు. కౌన్సిలర్లు బండి రాజేశ్వరి, మొసటి జ్యోతి, మాజీ కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: మంత్రి కేటీఆర్ సభకు మండల నాయకులు తరలివెళ్లారు. అధ్యక్షుడు ఆశన్న, కార్యదర్శి శరణప్ప, ఎంపీపీ నర్సప్ప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, జిల్లా రైతుసమితి అధ్యక్షుడు భీయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

మరికల్: జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపన నిమిత్తం వచ్చిన మంత్రి కేటీఆర్ సభకు మంగళవారం మండలం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మరికల్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ, సర్పంచ్ గోవర్ధన్, ఎంపీటీసీలు సుజాత, గోపాల్, బసంత్, రాజేష్, రామస్వామి, బాలకిష్ట, రవి తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: జిల్లా కేంద్రంలో నిర్వహించిన సభకు మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. ఎంపీటీసీ సుధీర్‌కుమార్, యువజన సంఘం అధ్యక్షులు సునీల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కంటి అద్దాల పంపిణీ

ఊట్కూరు: గ్రామపంచాయితీలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరంలో మంగళవారం అవసరం ఉన్న కంటి అద్దాలను పంపిణీ చేశారు. మండలంలో ఊట్కూరు, పులిమామిడిలలో కంటివెలుగు శిబిరం కొనసాగుతోంది. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, డా అనురాధ, సాయికుమార్, వైద్య సిబ్బంది కవిత, మణిమాల, విజయ్‌కుమార్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓటర్ల దినోత్సవ ర్యాలీ

నారాయణపేట రూరల్ : ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణ పుర వీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఏఎంఓ విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉదయం 9.30గంటలకు ఓటర్స్‌డే ప్రతిజ్ఞ చేపట్టాలని, 10గంటలకు కలెక్టరేట్ నుంచి ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీలో పాల్గొనే విధంగా సంబంధిత హెచ్‌ఎంలు చొరవ తీసుకుకోవాలన్నారు. పట్టణంలోని ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల విద్యార్థులు రావాలన్నారు. అయితే కొందరినే కార్యక్రమానికి ఆహ్వానించడం పట్ల పలు ప్రైవేటు విద్యాసంస్థలు, ట్రస్మా బాధ్యులు వ్యతిరేకిస్తున్నారు.

26న సభ

కోస్గి: జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోంలలో పని చేస్తున్న వైద్య సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల సాధన కోసం ఈ నెల 26న నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రైవేట్ నర్సింగ్ హోం వర్కర్స్ యూనియన్ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బాబుమియా సూచించారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రైవేట్ నర్సింగ్ హోంలను సందర్శించి సభను విజయవంతం చేయాలని ఆయా ఆస్పత్రుల వైద్య సిబ్బందిని కోరారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



బొమ్మన్‌పాడ్ స్కూల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్ : భాషా పండితులు, పీఈటీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా మంగళవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. మధ్యాహ్న భోజన సమయంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. 2017 ప్రపంచ తెలుగు మహాసభలలో పండిత్, పీఈటీలను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేస్తామని సీఎం కేసీఆర్ మాట ఇచ్చారని, ఐదేళ్లు గడిచినా కార్యరూపం దాల్చలేదన్నారు. తమను అప్‌గ్రేడ్ చేసిన తర్వాతనే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. బొమ్మన్‌పాడు, జాజాపూర్‌లలో జరిగిన కార్యక్రమంలో నాగార్జున్‌రెడ్డి, శ్రీకాంత్, రెడ్డప్ప, వాల్యానాయక్, రుద్రసముద్రం రాములు, సత్యనారాయణ, భానుప్రకాష్, సురేఖ, మాధవి, కనకప్ప, నిర్మల, కృష్ణవేణి, శిరీష పాల్గొన్నారు.

కోస్గి: ప్రభుత్వం చేపట్టనున్న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ఇదే షెడ్యూల్‌లో కోర్టు తీర్పుకు లోబడి తమకూ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని భాషా పండితులు, పీఈటీలు డిమాండ్ చేశారు. ఆయా పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

కృష్ణా: మండల కేంద్రంతో పాటూ గుడెబల్లూర్, కున్సి తదితర పాఠశాలల్లోని భాషా పండితులు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చేపట్టనున్న ఉపాధ్యాయుల పదోన్నతుల సమయంలోనే తమకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

వసతులు కల్పించాలని ఆస్పత్రి ఎదుట ధర్నా

అమరచింత: మండల కేంద్రంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెగ్యూలర్ డాక్టర్‌ను నియమించడంతో పాటు వసతులను కల్పించాలంటూ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో మంగళవారం ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజాపంథా మండల కార్యదర్శి రాజన్న మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఆస్పత్రి కొనసాగుతున్న రెగ్యులర్ డాక్టర్లు లేకపోవడంతో రోగులు సరైన వైద్యం అందక ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు దాపరించాయని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో 20 వేల జనాభా ఉందని, మండల వ్యాప్తగా 40వేల పైచిలుకు జనాభా ఉన్నా సరైన సౌకర్యాలతో కూడిన ఆస్పత్రి లేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మహిళల కోసం మహిళా డాక్టర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆస్పత్రి డాక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాజు, సామేలు, కురుమన్న, అంజనేయులు, మునెప్ప, భక్తరాజు, నాగరాజు, జిలాని, బీమన్న తదితరులు పాల్గొన్నారు.

ఇటుకల వ్యాపారి అదృశ్యం

దేవరకద్ర: స్థానిక మండల కేంద్రంలోని రాయిచూర్ రోడ్డులో ఇటుక వ్యాపారం చేసే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ భగవంతరెడ్డి తెలిపారు. భవితా కాలేజ్ సమీపంలో నివాసం ఉండే మద్దిగుంట సుబ్బారావు(55) గత కొంత కాలంగా సిమెంట్ ఇటుకలు, రింగులు, హౌస్‌లను తయారు చేసి వ్యాపారం చేసుకుంటున్నాడు. అయితే సోమవారం ఉదయం 9 గంటలకు ఇంటికి సమీపంలోనే ఉన్న షాపు వద్దకు వెళ్తానని చెప్పి వెళ్లాడు. కానీ షాపు వద్దకు వెళ్లక పోవడంతోపాటు తిరిగి ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికిన ఆచూకి లభించలేదని ఎస్‌ఐ తెలిపారు. కుమారుడు శశికుమార్ మంగళవారం ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమగ్ర అభివృద్ధే లక్ష్యం



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

కోస్గి: కులాలు, మతాలతోపాటు పార్టీలకతీతంగా అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ పరిధిలోని పోతిరెడ్డిపల్లి రోడ్డులో లింగాయత్‌ల కోసం ప్రత్యేకంగా కేటాయించిన స్థలంలో రూ.50 లక్షల వ్యయంతో రుద్రభూమి(స్మశాన వాటిక) నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్ పర్సన్‌లను వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అంతకు ముందు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే వివరాలు తెలుసుకున్నారు. చైర్ పర్సన్ మ్యాకల శిరీష, కమిషనర్ పూర్ణచందర్ రావు, కౌన్సిలర్లు బాలేష్, మాస్టర్ శ్రీను, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వరప్రసాద్, పార్టీ అధ్యక్షుడు మ్యాకల రాజేష్, అధికార ప్రతినిధి గందె ఓం ప్ర కాష్ పాల్గొన్నారు.

మద్దూరు: అందరికి నాణ్యమైన, మెరుగైన వైద్యం అందించడమే కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పల్లెర్లలో రూ.22 లక్షలతో ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.20 లక్షల ఉపాధి నిధులతో మంజూరైన నూతన పంచాయతీ భవనానికి భూమిపూజ నిర్వహించారు. గ్రామంలో రూ.5లక్షలతో వేస్తున్న సీసీ రోడ్ల పనులను ఎమ్మెల్యే స్థానిక సర్పంచ్ శిరీషా, ఎంపీటీసీ భార్గవితో కలిసి ప్రారంభించారు. గ్రంథాలయ కమిటీ చైర్మన్ రామక్రిష్ణ, పార్టీ నాయకులు రాములు, వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, రాజు, రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల

చిన్నచింతకుంట: కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ అండ్ వర్కర్స్‌ల సమస్యల పరిష్కారానికి ఈనెల 30న హైదరాబాద్‌లోని ఎస్‌పీడీ కార్యాలయం ఎదుట తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టినట్లు ప్రగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల నాన్‌టీచింగ్ అండ్ వర్కర్స్ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కేజీవీబీ పాఠశాలలో ధర్నాకు సంబంధించిన కర పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌దేవదానం, కేజీవీబీ పాఠశాల వర్కర్స్ భాగ్యమ్మ, కాంతమ్మ, జయమ్మ, పద్మమ్మ, సునిత, రామేశ్వరమ్మ, శ్రీదేవి, రుక్షాన పాల్గొన్నారు.

షెడ్లలో పారిశుద్ధ్యం పాటించాలి

చిన్నచింతకుంట: కోళ్ల ఫాం షెడ్లలో పారిశుద్ధ్యం లోపించకుండా యాజమాన్యం తగు జాగ్రతలు తీసుకోవాలని ఎంపీఓ అనీల్‌కుమార్ కోళ్ల ఫాం యాజమాన్యానికి సూచించారు. మండలంలోని లాల్‌కోట, పల్లమరి గ్రామాల సమీపంలో ఉన్న కోళ్ల ఫాం షెడ్లనుంచి ఈగల బెడద, దుర్వాసన వెదజల్లి ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఆయన కోళ్ల ఫాం షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ కోళ్ల ఫాం షెడ్లలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్యం లోపించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.